## ఎంఓయూ..

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): ఎంతో పురాతనమైన ఆయుర్వేద తాళ పత్రాల డిజిటలైజేషన్, పరిరక్షణపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ పలు సంస్థలతో ఒప్పం దం కుదుర్చుకుంది. తుంజన్ పండులిపి భండార్, కాలికట్ యూనివర్సిటీలో ఉన్న ఆయుర్వేద వైద్య విధానాలకు సంబంధించిన పురాతన తాళ పత్రాలను డిజిలీకరణ చేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్స్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ రావి నారాయణ్ ఆచార్య, కాలికట్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం.కె.జయరాజ్, తుంజన్ పండులిపి భండార్ డైరెక్టర్ డాక్టర్ మంజు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను పరిష్కరించండి

సిటీబ్యూరో, జూలై 10 ( నమస్తే తెలంగాణ ) : 'సీఎం ప్రజావాణి' దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్లను అదనపు కలెక్టర్ వెంకటాచారి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం 'సీఎం ప్రజావాణి దరఖాస్తు'లపై ఆయన తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 207 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని , అత్యధికంగా ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

## చెత్తను తొలగించకపోతే.. నోటీసులు పంపిస్తాం

సిటీబ్యూరో, జూలై 10 ( నమస్తే తెలంగాణ ) : బల్కాపూర్ నాలా, గ్రేవ్ యార్డ్ ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు నాలా చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. షేక్‌పేటలోని సక్కుబాయి సొసైటీలో ఉన్న నాలాను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఆ నాలా వద్ద చెత్త పేరుకుపోవడానికి కారణమైన సక్కుబాయి సొసైటీ యజమానిని కలెక్టర్ హెచ్చరించారు. సొంత ఖర్చుతో ఆ చెత్తను తొలగించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే నోటీసులు పంపించాలని అధికారులను ఆదేశించారు. 2012లో రెవెన్యూ ద్వారా అప్పగించబడిన 1700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న గ్రేవ్ యార్డ్ చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలని తెలిపారు. కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ ఎస్ఈ, తహసీల్దార్ అనితారెడ్డి,జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సంపత్, ఏఈ కిశోర్ వర్మ పాల్గొన్నారు.

## ఓయూలో 19 నుంచి 'వాణిజ్య - 2024'

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 10: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగంలో ప్రతీ ఏటా నిర్వహించే తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ 'వాణిజ్య - 2024' కార్యక్రమాన్ని ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వివిధ యూనివర్సిటీల పరిధిలోని కామర్స్ పీజీ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు dcouvanijya2024@gmail.com కు మెయిల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ గంగాధర్, కామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ చెన్నప్ప, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణచైతన్య, వాణిజ్య - 2024 కన్వీనర్ ప్రొఫెసర్ శేఖర్, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

# 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపులు

వర్షపు నీటిని సేకరించి..

ఆ తర్వాత నాలాల్లోకి నీరు మళ్లింపు

వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ

పలు ప్రాంతాలను సందర్శించిన దానకిశోర్



సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ ) : సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ బుధవారం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి ఖైరతాబాద్ జంక్షన్, రాజ్‌భవన్ రోడ్డులోని లేక్ వ్యూ గెస్ట్‌హౌజ్, సోమాజిగూడ ఆర్టీఏ ఆఫీస్ ప్రాంతాలను సందర్శించారు. ఈ ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపులను నిర్మిస్తున్నట్లు దానకిశోర్ తెలిపారు. నగరంలో గుర్తించిన నీళ్లు నిలిచే 140 ప్రాంతాలు సైతం..సంపులు నిర్మించడానికి తగిన స్థలాన్ని గుర్తించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఖైరతాబాద్ జోన్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో రూ. 20 కోట్లతో మొత్తం 11 ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపులు నిర్మిస్తారని తెలిపారు. వర్షం కురిసే సమయంలో ఈ సంపుల్లో నీటిని సేకరించి అనంతరం సమీపంలో ఉన్న నాలాల్లోకి పంపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్లు, ఎస్ఈలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సంపులు నిర్మించే ప్రాంతాలు..

లేక్ వ్యూ గెస్ట్ హౌజ్, కేసీపీ జంక్షన్, మెర్క్యూర్ హోటల్, ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీస్, ద్వారక హోటల్, లక్కీ హోటల్, ఖైరతాబాద్ రైల్వేగేట్, ఖైరతాబాద్ పెట్రోల్ పంపు, జోయాలుక్కాస్, అమీర్‌పేట ఇమేజ్ దవాఖాన వద్ద సంపులు నిర్మించనున్నారు. వర్షం కురిసే సమయంలో వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో నీరు నిలుస్తోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి ఆయా ప్రాంతాల్లో సంపులు నిర్మించనున్నారు. ఇందులో ఆ వర్షపు నీటిని సేకరిస్తారు. అనంతరం ఆ నీటిని సమీపంలోని నాలాల్లో పంపింగ్ చేస్తారు.

# ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు.. పురోగతి నిల్

ముందుకు కదలని కొత్వాల్‌గూడ ఏకో పార్క్ నిర్మాణం

పర్యావరణ, పర్యాటక కేంద్రంగా మారనున్న జంట జలాశయాలు

2022లోనే ప్రారంభించిన కేసీఆర్ సర్కార్

ఎన్నికలతో ఆగిపోయిన పనులను ఇప్పటికీ మొదలెట్టని హెచ్ఎండీఏ

కొత్వాల్‌గూడ ఏకో పార్క్ నిర్లిప్తతపై కేటీఆర్ ట్వీట్



కొత్వాల్‌గూడ ఏకో పార్కుకు శంకుస్థాపన చేసి నమూనాను పరిశీలిస్తున్న అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ , ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు (ఫైల్)

సిటీబ్యూరో, జూలై 10(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా మారింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా... ప్రాజెక్టుల్లో పురోగతి లేకుండా పోయింది. కోట్లు వెచ్చించి గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను పూర్తయ్యేలా చూడాల్సిన ప్రస్తుత ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికీ ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరి వంటి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం పెండింగ్ పనులపై దృష్టి సారించకపోవడంతోనే ఎన్నికలు ముగిసి ఏడు నెలలు గడుస్తున్నా... ప్రాజెక్టుల్లో మిగిలిపోయిన పనులు మొదలు కావడం లేదు. అయితే గత ప్రభుత్వం ఎంతో వేగంగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించిన హెచ్ఎండీఏ అధికారులు... 2022 లో ప్రారంభించిన ఏడాదిలోనే మెజార్టీ పను లు పూర్తి చేసింది. కానీ మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ పూర్తి చేయలేకపోయారు. కాగా కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకోవడంపై కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరానికి చారిత్రక నేపథ్యం ఉన్న జంట జలాశయాలకు సమీపంలో ఏకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రాజెక్టును ఇప్పటికైనా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎక్స్‌లో పేర్కొన్నారు.

పర్యాటకానికి పెద్ద పీట వేస్తూ అత్యాధునిక పర్యాటక కేంద్రంగా కొత్వాల్‌గూడలోని కొండలు, గుట్టల సమీపంలో కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగరానికి పర్యాటక వన్నె తెచ్చేలా చేపట్టిన ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్ ప్రతిష్ట మరింత పెరగనుంది. కోట్ల రూపాయల నిధులతో పచ్చని పరిసరాలు, అతిపెద్ద పక్షిశాల, అక్వేరియంతోపాటు వినోద కేంద్రం గా తీర్చిదిద్దేలా సన్నాహాలు చేసింది. 75 శాతానికి పైగా అప్పటి ప్రభుత్వం పనులు పూర్తి చేస్తే మిగిలిపోయిన 25 శాతం పనులకు ఇంకా మోక్షం కలగలేదు. దీంతో కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టులను పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని నగరవాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన నగర పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చే ఈ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్వాల్‌గూడ్ ఏకో పార్క్ విషయంలో హెచ్ఎండీఏ అధికారులను సన్నద్ధం చేయాలని, పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

### కాంగ్రెస్ నిర్లక్ష్యం పై కేటీఆర్ అసంతృప్తి

తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటైన కొత్వాల్‌గూడ ఏకో పార్క్ నిర్మాణంలో కమ్ముకున్న నీలినీడలపై పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో అసంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు 125 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే ఐవరీ, అక్వేరియం, బోర్డు వాక్స్, ల్యాండ్ స్కేపింగ్, వీకెండ్ క్యాపింగ్ వంటి అభివృద్ధి పనులతో ఈ ప్రాంతం పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. తమ ప్రభుత్వం ప్రారంభించి, పూర్తి చేసిన పనులు ఇప్పటికీ అలానే ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకుని హైదరాబాద్ నగరవాసులు కుటుంబంతో సహా ఆస్వాదించే ఏకో టూరిజం కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలంటూ ఎక్స్‌లో కోరారు.

## మోదీ పాలన.. దేశానికే ప్రమాదకరం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

చిక్కడపల్లి, జూలై 10 : కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలే అమలవుతున్నాయని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి రావడం దేశానికే ఎంతో ప్రమాదకరమని పేర్కొన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ.. ఎన్డీయేకు మద్దతు ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, జేడీయూ అధినేత నితిశ్‌కుమార్ కూడా సరళీకరణ విధానాలను వ్యతిరేకించబోరని , వాటికి మద్దతు ఇస్తారని తెలిపారు. విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ భారత అభివృద్ధిని చూసి ప్రపంచమంతా దిగ్భ్రాంతికి గురవుతున్నదంటూ వాఖ్యానించారని గుర్తు చేశారు. ఈ పదేండ్లలో అంత అభివృద్ధి జరిగితే జేజేపీకి 303 నుంచి 240కి సీట్లు ఎందుకు తగ్గుతాయని ప్రశ్నించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బీజేపీని నిలవరించటమే మా ప్రధాన కర్తవ్యమని.. ఆ పోరాటంలో ఎవరు కలిసొస్తే వారిని కలుపుకుని పోతామన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, నాయకులు జాన్‌వెస్లీ, మల్లు లక్ష్మి, ఎండి అబ్బాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు టి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నిన్న మంత్రి.. నేడు ఫొటోగ్రాఫర్

బల్కంపేటలో రెండో రోజూ పొన్నంకు తప్పని చేదు అనుభవం

పొన్నం వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌పై చేయి చేసుకున్న పోలీసులు

అమీర్‌పేట్, జూలై 10: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మరోసారి చేదు అనుభవం ఎదురైంది. నిన్న ఎల్లమ్మ కల్యాణోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ పాటించని కారణంగా సాక్షాత్తు మంత్రి ఇబ్బందులు పడితే.. నేడు ఎల్లమ్మ రథోత్సవానికి మంత్రి వెంట వచ్చిన వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌పై పోలీసులు చేయి చేసుకున్నారు. బుధవారం సాయంత్రం బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా రథానికి పూజలు నిర్వహించి ప్రారంభించేందుకు మంత్రి పొన్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిన్నటి ఘటనతో అప్రమత్తమైన పోలీసులు.. మంత్రి దరిదాపులకు కూడా సామాన్యులను అనుమతించలేదు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రథోత్సవాన్ని ప్రారంభించి తిరుగుముఖం పడుతున్న సమయంలో మంత్రి పొన్నం ఒక చోట నిలుచున్నారు. మంత్రి ఫొటోలు తీసేందుకు వ్యక్తిగత ఫొటోగ్రాఫర్ ముందుకు చొచ్చుకురావడంతో బందోబస్తులో ఉన్న పోలీసులు అతన్ని కాలర్ పట్టుకుని పక్కకు లాగారు. నేను మంత్రి వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌నని చెబుతున్నా వినకుండా పోలీసులు అతనిపై చేయి చేసుకున్నారు. అప్పటికే తన వాహనంలో కూర్చున్న మంత్రికి విషయం తెలవడంతో అక్కడున్న పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీసీపీ విజయ్‌కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

### ప్రత్యేక పూజలు..

బల్కంపేట ఎల్లమ్మ ఉత్సవాల్లో చివరి ఘట్టమైన రథోత్సవం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి రథానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమలతో కలిసి పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ రథం బల్కంపేట నుంచి ఎస్ఆర్‌నగర్ పాత పోలీస్‌స్టేషన్, కమ్యూనిటీ హాలు చౌరస్తా, వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నుంచి బీకే గూడ 60 ఫీట్ రోడ్డు మీదుగా తిరిగి ఎల్లమ్మ దేవాలయానికి చేరడంతో వేడుకలు ముగిశాయి. అంతకుముందు అమ్మవారికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని బోనం సమర్పించారు. ఈ వేడుకల్లో దేవాలయ ఈవో అంజనీదేవి, చైర్మన్ సాయిగౌడ్ సహా పలువురు పాల్గొన్నారు.



విధుల్లో ఉన్న విద్యుత్ ఉద్యోగులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

## దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీఎండీకి ఉద్యోగుల సంఘం వినతి

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): పాతనగరంలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సీఎండీకి వినతి పత్రం అందజేశారు. బుధవారం ఖైరతాబాద్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు సీఎండీ ముషారఫ్ ఫరూఖీని కలిశారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో ఈనెల 6న పాతనగరంలోని మీరాలం మండి ప్రాంతంలో విద్యుత్ ఇంజినీర్లు తనిఖీలు నిర్వహించారని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల విధులను అడ్డుకోవడమే కాకుండా వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారని సీఎండీకి ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో విద్యుత్ శాఖ పనులు చేయకుండా అడ్డుకొని అక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారని, ఇలాంటివి ఈ ప్రాంతంలో తరచూ జరుగుతున్నాయని తెలిపారు. దీంతో ఉద్యోగులు పాతనగరంలో విధులు నిర్వహించాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొందని.. ప్రభుత్వం అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మునుముందు పాతనగరంలో విధులు నిర్వహించలేమని, ముఖ్యంగా కరెంటు బిల్లు వసూలు, సర్వీసుల తనిఖీలు వంటివి చేయకుండా అడ్డుకుంటున్నారని ఉద్యోగుల జేఏసీ నాయకులు సీఎండీకి వివరించారు. సీఎండీని కలిసిన వారిలో జేఏసీ నాయకులు సాయిబాబు, రత్నాకర్, శ్రీధర్‌లతో పలువురు ఉన్నారు.

## 4 కోట్ల మొక్కలే లక్ష్యం..

వన మహోత్సవానికి హెచ్ఎండీఏకు భారీ లక్ష్యం

మొక్కలు నాటేందుకు ప్రణాళికలు

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది వన మహోత్సవానికి హెచ్ఎండీఏకు భారీ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో ఒకే ఏడాదిలో 4 కోట్ల మొక్కలను ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్న హెచ్ఎండీఏ పరిధిలో నాటనున్నారు. వీటితో పాటు కోటి మొక్కలను పంపిణీ చేసేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేయనుంది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న నర్సరీలో ఇప్పటికే మొక్కలను అర్బన్ ఫారెస్ట్రీ విభాగం సర్దుబాటు చేసుకుంటుంది. హెచ్ఎండీఏ పరిధిలోని ఖాళీ స్థలాలు, పార్కులు, చెరువు కట్టలు, లేక్ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే భారీ స్థాయిలో ఉన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇప్పటికీ వరకు అధికారులు మాత్రం ఎలాంటి కార్యాచరణ మొదలు పెట్టలేదు. ఈ ఏడాది పొడవునా మొక్కలు నాటనున్నారు. గతంలో మొక్కలు నాటేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణకు హరిత హారం కార్యక్రమానికి ధీటుగా ఈసారి లక్ష్యం కంటే ఎక్కువ మొక్కలు నాటాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఎన్ని మొక్కలు సిద్ధంగా ఉన్నాయనే విషయంలో అధికారుల నుంచి స్పష్టత లేకుండా పోయింది. ఈ క్రమంలో భారీ లక్ష్యంతో మొక్కల పెంపకం చేయాలనే ప్రణాళిక ఆచరణకు సాధ్యం అవుతుందో లేదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### పండ్ల మొక్కలకు ప్రాధాన్యత..

ఇప్పటికే గుర్తించిన ఖాళీ స్థలాల్లో సాధారణ మొక్కలతోపాటు, పండ్లు, పూల మొక్కలు కూడా నాటేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. అటవీ జాతి మొక్కలతోపాటు, పండ్ల మొక్కలను కూడా నాటనున్నారు. అయితే ఖాళీ స్థలాల్లోనే కాకుండా రోడ్డు మధ్యలో ఉన్న సెంట్రల్ మీడియన్ మార్గాల్లో నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు జామ, సీతాఫలం, మామిడి వంటి పండ్ల మొక్కలతో పాటు, వేప, రావి లాంటి ఆయుర్వేద గుణాలు ఉన్నా మొక్క జాతులను ఎంపిక చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు హెచ్ఎండీఏ వద్ద ఎన్ని మొక్కలు సిద్ధంగా ఉన్నాయనేది అధికారులు వెల్లడించలేదు. కానీ ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు నాటుతామంటూ అర్బన్ ఫారెస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో హెచ్ఎండీఏ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మొక్కల పెంపకం నిర్దేశిత లక్ష్యంపై నీలి నీడలే కమ్ముకున్నాయి.

## పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలి



టీఎన్జీవో అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్,డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీలను గజమాలతో సన్మానిస్తున్న తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

సుల్తాన్‌బజార్, జూలై 10 : ఎంతో చరిత్ర కలిగిన టీఎన్జీవో సంఘాన్ని నడిపే శక్తి, పూర్వ వైభవం తీసుకువచ్చే సామర్థ్యం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు ఉన్నదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. బుధవారం పొట్టి శ్రీరాములు తెలుగు లలిత కళాతోరణంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం హుస్సేనీలకు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరామ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావలసిన డీఏలు పెండింగులో ఉన్నాయని వాటిని ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వ ర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించిన 20 సమస్యలను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగులకు రావల్సిన డీఏలను త్వరలో ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్, టీజీవో అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్‌రావుతో కలిసి టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 32 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి ఎస్ విక్రమ్ కుమార్, కోశాధికారి జే బాలరాజ్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, వివిధ యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## వంగపల్లిని దత్తత తీసుకుంటాం : ప్రభుత్వ విప్ అయిలయ్య



యాదగిరిగుట్ట : వంగపల్లిలో మొక్కలు నాటుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, జూలై 10 : మండలంలో పెద్ద గ్రామమైన వంగపల్లిని దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని వంగపల్లి క్రీడా ప్రాంగణంలో బుధవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని.. సీఎం చొరవతో, ఎంపీ నిధులతో అభివృద్ధి చేపడుతామని అన్నారు. రూ.11.20 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో అందరం పాల్గొని తమ వంతుగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఏ పీడీ ఎంఏ కృష్ణన్, డీఈఓ నారాయణరెడ్డి, అదనపు డీఆర్‌డీఏ సురేశ్, ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ చంద్రశేఖర్, ఏపీఓ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు రవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంగమ్మ పాల్గొన్నారు.

### పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని వినతి

వంగపల్లి పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ రేగు బాలనర్సయ్య వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు గదులు, ప్రాథమిక పాఠశాలలో రెండు గదుల నిర్మాణం చేపట్టగా.. అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పాఠశాల మైదానంలో ఫ్లడ్ లైట్లు, మోటకొండూర్ జంక్షన్, వంగపల్లి పెద్దవాగు వరకు స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జోగు శంకర్, పబ్బు మహేశ్, ఎడపల్లి బాలరాజు పాల్గొన్నారు.

## తాసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుమందుతో రైతు కుటుంబం నిరసన



గుండాల తాసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతు లింగయ్య దంపతులు

గుండాల, జూలై 10 : ఇరవయ్యేండ్ల కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న భూమిని తమకు పట్టా చేయడం లేదంటూ రైతు దంపతులు ఆందోళనకు దిగారు. పలుమార్లు ధరణిలో అప్లయ్ చేసుకున్నా రిజక్ట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగు మందు డబ్బాతో నిరసనకు దిగారు. బాధితుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మండలంలోని పెద్దపడిశాల గ్రామానికి చెందిన బొడ్డు లింగయ్య, మల్లమ్మ దంపతులు అదే గ్రామంలోని సర్వేనెం.279లో 25 గుంటల భూమిని 2004 సంవత్సరంలో మారోజు ఈశ్వరమ్మ వద్ద కొనుగోలు చేశారు. అప్పటి నుంచి అదే భూమిలో కబ్జాలో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నారు. ధరణిలో పట్టా మాత్రం తమ పేరు మీద రాకపోవడంతో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. రెవెన్యూ అధికారులు కావాలనే రిజక్ట్ చేస్తున్నారని ఆరోపిస్తూ లింగయ్య, మల్లమ్మ బుధవారం గుండాల తాసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పురుగుమందు డబ్బాతో నిరసన తెలిపారు. తాసీల్దార్ జలకుమారి స్పందిస్తూ.. ఆర్ఎస్ఆర్ హెచ్చుతగ్గుల కారణంగా ఆన్‌లైన్‌లో టెక్నికల్ సమస్య ఏర్పడిందని, దాంతో దరఖాస్తు రిజక్ట్ అయ్యిందని తెలిపారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంటికి పంపించారు. నిరసనకు దిగిన లింగయ్య దంపతులకు పెద్దపడిశాల మాజీ సర్పంచ్ రావుల మల్లేశ్ సంఘీభావం తెలిపారు.

## పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్యకు సన్మానం



పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్యను సత్కరిస్తున్న సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి

రవీంద్రభారతి , జూలై 10 : పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య బుధవారం రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమీనీ సందర్శించి, అకాడమీ కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అకాడమీ ఇటీవల మాజీ ప్రధానమంత్రి పి.వి నరసింహారావుకు భారతరత్న పురస్కారం లభించిన సందర్భంగా వెలువరించిన పునాస పత్రిక చాలా బాగుందని విఠలాచార్య ప్రశంసించారు. ఈ సందర్భంగా సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి విఠలాచార్యను సన్మానించి వారి గ్రంథాలయానికి అకాడమీ ముద్రించిన కొన్ని పుస్తకాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాపోలు సుదర్శన్, తిరుపాల్, సిబ్బంది పాల్గొన్నారు.